'గీతమ్' కు మెగా ప్లాంటేషన్ అవార్డు

పటాన్‌చెరు, మార్చి 7: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయానికి మెగా ప్లాంటేషన్ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో సీఐఐ రాష్ట్ర వార్షిక సమావేశం 2023-24కు సంబంధించి సుస్థిర తెలంగాణ నిర్మాణంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో గీతమ్ హైదరాబాద్‌కు సీఐఐ మెగా ప్లాంటేషన్ అవార్డును అందజేశారు. అవార్డును గీతం రెసిడెంట్ డైరెక్టర్ వీవీఎస్ఆర్ వర్మ అందుకున్నారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ఏడేండ్లుగా హరితహారంలో మొక్కలు నాటి గీతం విశ్వవిద్యాలయం ఈ అవార్డును స్వీకరించిందన్నారు. గీతంలో పచ్చదనం, పర్యావరణానికి అధిక ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. విద్యార్థులు చురుకుగా మొక్కలు నాటి సంరక్షిస్తారని తెలిపారు. గీతం మెగా ప్లాంటేషన్‌కు మద్దతుగా నిలిచిన విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్యానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

గీతమ్‌కు సీఐఐ మెగా ప్లాంటేషన్ అవార్డును అందజేస్తున్న ప్రతినిధులు

డ్యూటీలో ఉన్న పోలీసు కానిస్టేబుల్‌పై దాడి

నిందితుడు కిరణ్‌కుమార్

రామచంద్రాపురం, మార్చి 7: మద్యం మత్తులో డ్యూటీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని ఆర్సీపురం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్లితే..ఆర్సీపురం డివిజన్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలో ఉండే సత్తయ్య కుమారుడు కిరణ్‌కుమార్ గతనెల 4న రాత్రి మద్యం తాగి తండ్రి సత్తయ్యను కొడుతుండడంతో ఆయన 100కు కాల్‌చేసి పోలీసులకు సమాచారం అందించాడు. పెట్రోలింగ్‌లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌రాథోడ్ ఘటనా స్థలానికి వెళ్లి విషయం తెలుసుకుంటున్న నేపథ్యంలో మా గొడవలోకి ఎందుకు వస్తున్నారని ఆగ్రహంతో కిరణ్‌కుమార్ దాడికి పాల్పడ్డాడు. ప్లాస్టిక్ కుర్చీతో శంకర్‌రాథోడ్ తలపై కొట్టడంతో తలపగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో దవాఖానకు తరలించారు. పోలీసులు కిరణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి మందలించారు. అయినా తన ప్రవర్తన మార్చుకోకుండా తండ్రిపై మరోసారి దాడి చేయడంతో ఆయన మళ్లీ 100కాల్ చేసి సమాచా రం ఇవ్వడంతో పోలీసులు బుధవారం కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి

సదాశివపేట, మార్చి 7: సదాశివపేట పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్‌పాటిల్ అన్నారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా చాంబర్‌లో బసవేశ్వరుడి చిత్రపటానికి అపర్ణాశివరాజ్‌పాటిల్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఉమ, మున్సిపల్ సిబ్బంది చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా తో సన్మానించారు. కౌన్సిలర్లు, నాయకులు చైర్‌పర్సన్ అపర్ణాశివరాజ్ పాటిల్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు ఇంద్రమోహన్‌గౌడ్, ప్రకాశ్, బీఆర్ఎస్ పట్టణ ప్రధానకార్యదర్శి వీరేశం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సహాయకేంద్రం ప్రారంభం

ప్రజాపాలన సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఉద్యోగులు

బొల్లారం మార్చి 6: బొల్లారం మున్సిపాలిటీ తాత్కాలిక కార్యాలయంలో ప్రజాపాలన సహాయ కేంద్రాన్ని కమిషనర్ మంగతాయారు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారు తప్పులను సరిదిద్దుకోవడానికి సహాయ కేంద్రాలు పని చేస్తాయన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు లబ్ధిదారుల పేర్లు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డుల్లో ఏమైనా మార్పులు, చేర్పులు చేయాలంటే సహాయకేంద్రంలో అవకాశం ఉంటుందన్నారు. కొత్తగా ప్రజాపాలన దరఖాస్తులు సైతం స్వీకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, మహేందర్ ఉన్నారు.

తేలని అవిశ్వాస ఫలితం

జిన్నారం, మార్చి 7: వావిలాల పీఏసీఎస్ చైర్మన్ శేరికారి శంకర్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాస ఫలితం ఎటూ తేలలేదు. డీసీవో(జిల్లా సహకార అధికారి) తుమ్మ ప్రసాద్ గురువా రం వావిలాల పీఏసీఎస్ కార్యాలయంలో అవిశ్వాసంపై సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్‌కు చెందిన ఎనిమిది మంది డైరెక్టర్లు హాజరుకాగా, బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్ శేరికారి శంకర్‌రెడ్డితోపాటు మరో నలుగురు డైరెక్టర్లు గైర్హాజరయ్యారు. అవిశ్వాసంపై డీసీవో తుమ్మప్రసాద్ సభ్యుల నుంచి సంతకాలు, వారి అభిప్రాయాలు తీసుకున్నారు. అవిశ్వాసం వీగిందా? నెగ్గిందా? అనేది తేలలేదు. దీనిపై విలేకరులు డీసీవోను అడగ్గా పీఏసీఎస్ చైర్మన్ అవిశ్వాసంపై కోర్టు నోటీసులు ఉన్నాయని, ఫలితాన్ని ఈనెల 15వ తేదీ వర కు చెప్పలేమన్నారు. అవిశ్వాసం సందర్భంగా జిన్నారం ఎస్ఐ విజయ్‌రావు పోలీసు సిబ్బందితో భద్రతను ఏర్పాటు చేశారు.

PUBLIC NOTICE

All are hereby put to notice that **Mr. Dharam Karan Singh Thakur, S/o. Narayana Singh Thakur** is the the absolute owner and intending to sell the land to my client, **Mr. Bavisetti Satyanarayana S/o Late Sri Bavisetti Gopala Krishnaiah** and offered the following property to my client and my client has accepted the said offer as genuine in good faith. Hence if anybody has any objection of any kind against the said sale transaction, they shall intimate in writing to the below given address within 10days of this publication. If no objection is received, my client would assume the said property as undisputed and bonafide and would proceed to enter and complete the sale transaction and any claim/interest of any kind thereafter would not bind my client. **Property Details:** All that open Plot No. 66/A/part, admeasuring 158.5 Square yards, situated at lay out named as "Thakur Nivas" in Survey No's All that part and parcel of the open Plot bearing No.66/A/part in Survey Nos.1/ఆ 178/ఆ, 209/అ, 211/అ, 1/అ, 178/అ, 209/ఆ, 211/ఆ, 177/ఆ and 177/అ3, (Out of total area Ac. 10-13 1/2 Gts) situated at Pocharam village Patancheru Mandal, Medak District, Telangana State

Sd/- Sreekanth Palateerdhapu,
Advocate
406, Lotus Anasuya,
Pragati Nagar,
JNTU, Kukatpally,
Hyderabad-500090
Mobile: 98495 50131
Email: sriyuja@gmail.com

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

కోహీర్, మార్చి 7: మండలంలోని బడంపేట రాచన్నస్వామి ఆలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప కోరారు. గురువారం ఆలయావరణలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ బాలశంకర్, ఎస్సై చంద్రయ్య, దయానంద్ పాటిల్, శివానంద్ పాల్గొన్నారు.

రాగి ఆకుపై శివుడి చిత్రం

మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పెద్దగోలారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు అనురాధ రాగి ఆకుపై శివుడి చిత్రాన్ని చిత్రీకరించారు. - మునిపల్లి

అందోల్ -జోగిపేట అభివృద్ధికి కృషి

అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి దామోదర

అందోల్: జోగిపేటలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

అందోల్, మార్చి 7 : అందోల్-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో గురువారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.80కోట్లతో జోగిపేట నుంచి చిలిపిచెడ్ మండలం అజ్జమర్రి వరకు మంజీరానదిపై వంతెన నిర్మాణానికి, రూ.20కోట్లతో సంగుపేట చౌరస్తా నుంచి జోగిపేట మీదుగా అన్నాసాగర్ వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి, రూ.6కోట్లతో అందోల్-జోగిపేట మున్సిపల్ బిల్డింగ్ నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం రూ. 2.5కోట్లతో అందోల్ చెరువు సుందరీకరణ, రూ. 2కోట్లతో స్టేడియం అభివృద్ధి, రూ. 21కోట్లతో మున్సిపల్ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.4.15 కోట్లతో డిగ్రీ, జూనియర్ కళాశాల, మహిళా పాలిటెక్నిక్, సంగుపేట వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల ప్రహరీ నిర్మాణాన్ని, రూ.2.13 కోట్లతో ప్రభుత్వ దవాఖానల్లో పలు అభివృద్ధి పనులను కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ అందోల్-జోగిపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకొస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంసీ సురేశ్‌షెట్కార్, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు సత్యనారాయణ, భవానీనాగరత్నం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి సామర్థ్యం గొప్పది

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- డీడీఎస్ మహిళా లీగల్ కార్యకర్తలకు సన్మానం

జహీరాబాద్ : ర్యాలీ నిర్వహిస్తున్న డీడీఎస్ మహిళాసభ్యులు

జహీరాబాద్, మార్చి 7: మహిళల అభివృద్ధికి ఎన్నో సంస్థలు పని చేస్తున్నాయని, మహిళా శక్తి సామర్థ్యం గొప్పదని సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ డైరెక్టర్ గిరిజాదేవి అన్నారు. గురువారం పట్టణంలోని కుమార్ హోటల్ (కెనరా బ్యాంకు) నుంచి కేఫ్ గ్రీన్ ఎథ్నిక్ హోటల్ వరకు డీడీఎస్ మహిళా సభ్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పస్తాపూర్‌లోని ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా అభివృద్ధి అంటే తెలివి, విలువలను గుర్తించి ముందుకు నడవడమన్నారు. డీడీఎస్ సంఘంలో ఎన్నో ఏండ్లుగ్లా పనిచేస్తున్న లీగల్ మహిళా కార్యకర్తలైన కందకం మొగులమ్మ, చంద్రమ్మ, స్వరూపమ్మను సన్మానించారు.

విద్యతోనే మహిళ ల అభివృద్ధి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 7: విద్యతోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 111వ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ మహిళా అధికారులు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లింగ వివక్ష లేని సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న మహిళాఅధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మజారాణి, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సీడీపీవోలు పాల్గొన్నారు.

కందిలో..

కంది, మార్చి 7: కంది ఎంపీపీ కార్యాలయ ఆవరణలో గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ సరళాపుల్లారెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సంబురాలు అంబరాన్నంటాయి. మహిళా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, వైస్ఎంపీపీ లక్ష్మణ్‌గౌడ్, సూపరింటెండెంట్ వేణు, మహిళాఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

జిన్నారం, మార్చి 7 : జిన్నారంలోని మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఎంపీడీవో అరుణ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు, కుర్చీ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. అనంతరం మహిళా ఉద్యోగులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిన్నారం ఎంపీటీసీ-1లావణ్యానరేశ్, గడ్డపోతారం ఎంపీటీసీ జనాబాయి, పీహెచ్‌సీ వైద్యురాలు కోమలి, ఐకేపీ ఏపీఎం నరేందర్, ప్రవీణ్, పంచాయతీ సెక్రటరీలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఝరాసంగంలో...

ఝరాసంగం, మార్చి 7: మండలంలోని జీర్లపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం మహిళా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మారుతీవిఠోభ, ఏపీవో రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యాయులు పాండురంగారెడ్డి, విజయలక్ష్మి, జగదీశ్, మమత, అమృతబాయ్, రజిత, సుష్మిత పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు సన్మానం

నారాయణఖేడ్, మార్చి 7: మేడారం జాతర సందర్భంగా నారాయణఖేడ్ డిపో నుంచి 30బస్సులు నడపడంతో పాటు కలెక్షన్‌లో ప్రథమస్థానంలో నిలిచినందుకు ఖేడ్ ఆర్టీసీ డిపో డ్రైవర్లు, కండక్టర్లను గురువారం సన్మానించారు. హైదరాబాద్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వారిని సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేసినట్లు డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు. డ్రైవర్లు బీఎస్‌రెడ్డి, మల్కయ్య, కండక్టర్ నర్సింహులను సన్మానించారని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్ఎం ప్రభులత, డిప్యూటీ ఆర్ఎం దైవాధీనం సిబ్బందిని, ఉద్యోగులను అభినందించారు.

గురురాజ శర్మకు సత్కారం

నారాయణఖేడ్, మార్చి 7: పట్టణానికి చెందిన ప్రముఖ పురోహితుడు గురురాజ శర్మను సత్కరించారు. వివిధ గ్రామాల్లో వంద ప్రతిష్ఠాపనలు పూర్తి చేసిన సందర్భంగా కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్, గజేంద్రాశ్రమ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ ఆయనను ఘనంగా సత్కరించారు. గురురాజ శర్మకు శత ప్రతిష్ఠాచార్య రత్న బిరుదాంకితం చేశారు. నారాయణఖేడ్ ప్రాంతంలో ఆధ్యాత్మిక వ్యాప్తికి గురురాజ శర్మ చేస్తున్న కృషిని వారు అభినందించారు.

ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన

నారాయణఖేడ్, మార్చి 7: నారాయణఖేడ్ మండలంలోని సీతారాం తండాలో గురువారం యునైటెడ్ వే ముంబయి ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కల్పించారు. గ్రామీణ మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చేందుకు ముంబయికి చెందిన స్వచ్ఛంద సంస్థ శిక్షణనిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తుందని మొబిలైజర్ శంకర్ తెలిపారు. ఆర్థిక వనరులను వినియోగించే విధానం, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకునే అంశాలపై మహిళలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పప్పు, రాము పాల్గొన్నారు.

నేటి నుంచి జాతర

జిన్నారం, మార్చి 7 : మండలంలోని ఊట్లలో శుక్రవారం నుంచి మల్లన్న, లక్ష్మీ నర్సింహస్వామి, రేణుకాఎల్లమ్మ జాతర జరగనున్నాయి. నాలుగు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. శుక్రవారం సాయంత్రం గంగాపటం ఊరేగింపు, శనివారం అగ్నిగుండాలు, బండ్లు, బోనాలు, ఆదివారం నాగవెల్లి, సోమవారం రేణుకాఎల్లమ్మ చరిత్ర, సాయంత్రం బోనాలు ఉంటాయని తెలిపారు.

ఘనంగా స్వయంపాలన

న్యాల్‌కల్, మార్చి 7: మండలంలోని హద్నూర్ మండల ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

భూపాల్‌రెడ్డిని పరామర్శించిన హరీశ్‌రావు

రామచంద్రాపురం, మార్చి 7: ప్రొటెం మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి అనారోగ్యంతో జూబ్లీహిల్స్‌లోని అపోలో దవాఖానలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అపోలో దవాఖానకెళ్లి భూపాల్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో, వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్సను అందించాలని సూచించారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి ఉన్నారు.

ముగిసిన జాతీయ వర్క్‌షాప్

ఎస్‌పీఎస్ఎస్‌పై అవగాహన కల్పిస్తున్న బిట్‌పిలాని ప్రొఫెసర్ వీవీ హరగోపాల్

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 7: విద్యార్థులు, రీసర్చ్ స్కాలర్స్ స్టాటిస్టికల్ ప్యాకేజ్ ఫర్ సోషల్ సైన్సెస్ (ఎస్పీఎస్ఎస్) సాఫ్ట్‌వేర్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ సూచించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ ఆర్థిక సహకారంతో పరిశోధనకు ఉపయోగపడే ఎస్‌పీఎస్ఎస్ అనే అంశంపై తారా ప్రభుత్వ కళాశాల ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎస్‌పీఎస్ఎస్ సాఫ్ట్‌వేర్ పీజీ, పీహెచ్‌డీ స్థాయిల్లో పరిశోధనలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జాతీయ వర్క్‌షాప్ నిర్వహణ కోసం ఆర్థికసాకారం అందించిన మంత్రి దామోదర రాజనర్సింహ, మలబార్ గోల్డ్ యాజమాన్యం శ్రీనివాస, సన్ పైప్ ఇండస్ట్రీస్ అధినేత వెంకన్నలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ కళాశాలకు అండగా నిలవడం సంతోషకరమన్నారు. అంతకుముందు రెండోరోజు వర్క్‌షాప్‌లో భాగంగా బిట్స్‌పిలానీ ప్రొఫెసర్ వీవీ హరగోపాల్ మాట్లాడు తూ ఎస్‌పీఎస్ఎస్‌పై అధ్యాపకులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఆకుల వెంకటేశం, కోకన్వీనర్ డాక్టర్ నాగప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ జగదీశ్వర్, వివిధ కళాశాలల అధ్యాపకులు జలీల్, రాజేందర్ కుమార్, డాక్టర్ జోత్స్న, డాక్టర్ విజయ, సీహెచ్ వెంకటేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓంకారేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు

కోహీర్, మార్చి7: కోహీర్ (ఓంకార పట్టణం) లోని ఓంకారేశ్వరాలయంలో గురువారం మహాశివరాత్రి వేడుకలను వైభవంగా జరుగుతున్నాయి. సద్గురు ప్రతాపదక్షిణామూర్తి దీక్షితుల ఆధ్వర్యంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఓంకారేశ్వరుడి వ్రతదీక్ష విరమణ, శనివారం సాయంత్రం రథోత్సవం, అన్నదానం నిర్వహిస్తామని సద్గురు దీక్షితులు తెలిపారు.

బ్రహ్మకుమారీస్ కేంద్రాల్లో ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం, మార్చి 7: మహాశివరాత్రిని పురస్కరించుకొని భెల్, ఆర్సీపురం శ్రీనివాస్‌నగర్‌కాలనీలో ఉన్న బ్రహ్మకుమారీస్ కేంద్రాల్లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆర్సీపురంలోని సెంటర్‌లో 12జ్యోతిర్లింగాల ప్రదర్శన, భెల్‌లో భారీ శివలింగాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి పాల్గొని శివలింగాన్ని దర్శించుకున్నారు. ఆర్సీపురం బ్రహ్మకుమారీస్ సెంటర్‌లో ఏర్పాటు చేసి న జ్యోతిర్లింగాలను కార్పొరేటర్ పుష్పానగేశ్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఓంశాంతి సభ్యులు సరళ, భెల్ యూనియన్ నాయకుడు రాజునాయక్ ఉన్నారు.

మహాశివరాత్రికి శివాలయాలు ముస్తాబు

జహీరాబాద్, మార్చి 7: జహీరాబాద్ పట్టణం అల్గోల్ రోడ్డులోని సిద్ధేశ్వర్ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఉత్సవాలను శుక్రవారం నుంచి ఈనెల 9 వరకు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని సోమేశ్వర, కైలాసగిరి ఆలయాలు మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యాయి.

మహాశివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

న్యాల్‌కల్, మార్చి 7: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. మండలంలోని రేజింతల్ సిద్ధివినాయక, ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమం, మల్లి గ్రామ శివారులోని నవనాథ్ సిద్ధలింగేశ్వర స్వామి ఆలయం, న్యాల్‌కల్‌లోని రామలింగేశ్వర ఆలయం, మిర్జాపూర్(ఎన్) గ్రామంలోని రాచన్నస్వామి ఆలయం, రాఘవపూర్ గ్రామ శివారులోని పంచవటీ క్షేత్రంలోని జ్యోతిర్లింగాలు, మంజీరా నది ఒడ్డున గంగామాత ఆలయాల్లో శివలింగాలకు ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. భక్తుల దర్శనాల కోసం ఏర్పాట్లను ఆలయాలను సిద్ధం చేశామని ఆయా ఆలయాల కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

రుణాలు వసూలు చేయాలి

కోహీర్, మార్చి 7: బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా డ్వాక్రా సంఘాల మహిళలకు అందించిన రుణాలను రికవరీ చేయాలని ఐకేపీ డీపీఎం మల్లేశం ఆదేశించారు. గురువారం కోహీర్ పట్టణంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ఐకేపీ ఏపీఎం, సీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలను వసూలు చేయాలని కోరారు. సకాలంలో చెల్లించిన సంఘాలకు మాత్రమే మరోసారి మంజూరు చేయించాలన్నారు. సమావేశంలో ఏపీఎం సమ్మయ్య, సీసీలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం, మార్చి 7: ఖాజీపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 181 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. శంభీపూర్ గ్రామానికి ఆనుకొని ఉన్న ఖాజీపల్లి 181ప్రభుత్వ భూమిలో రోడ్డు పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన కమర్షియల్ డబ్బాలను జేసీబీతో ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ తొలిగించారు. కాలనీలోని రాత్రికి రాత్రి చేపట్టిన నిర్మాణాల ను కూల్చివేశారు. తహసీల్దార్ భిక్షపతి ఆదేశాలతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశామని చెప్పారు. వీరిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ

మరో కార్మికుడు మృతి

హత్నూర, మార్చి 7: గుండ్లమాచునూర్ శివారులోని కోవాలెంట్ ల్యాబరేటరీ పరిశ్రమలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో మరోకార్మికుడు మృతి చెందినట్లు హత్నూర ఎస్ఐ సుభాష్ తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన లాల్‌బాబుతురై(37) రెండురోజులుగా కాలిన గాయాలతో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు చెప్పారు. అదే రాష్ట్రానికి చెందిన మరో ఇద్దరు కార్మికులు స్వాదిన్ రాజమల్, ఫాదర్‌మారండీ చికిత్సపొందుతున్నప్పటికీ పరిస్థితి విషమంగా ఉందన్నారు. పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు భద్రత కల్పించకపోవడంతోనే మృత్యువాత పడుతున్నట్లు కార్మికులు, బాధిత కుటుంబీకులు, కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కొన్ని నెలలుగా పరిశ్రమలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పరిశ్రమల్లో భద్రతాచర్యలు పర్యవేక్షించాల్సిన అధికారులు పరిశ్రమ యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

మహా శివరాత్రి
మరియు అంతర్జాతీయ
మహిళా దినోత్సవ
శుభాకాంక్షలు